క్లుప్తంగా

మల్లవరంలో అతిథి గృహాల ప్రారంభం

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో భక్తుల విరాళాలతో ఏర్పాటు చేసిన అతిథి గృహాలు, కల్యాణ కట్టలను స్థానిక ఎమ్మెల్యే విజయకుమార్, 20 సూత్రాల కమిటీ చైర్మన్ లంకా దినకర్ గురువారం ప్రారంభించారు. శ్రీవారి వనం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మల్లవరం దేవాలయం, రిజర్వాయర్‌లను మంచి పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఉత్తమ పీహెచ్‌సీగా మద్దిపాడు

మద్దిపాడు: మద్దిపాడు పీహెచ్‌సీ ఉత్తమ అవార్డుకు ఎంపికై నట్లు ఎంపీడీఓ వి.జ్యోతి తెలిపారు. స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ అవార్డు లభించినట్లు చెప్పారు. దాంతో పాటు లింగంగుంట, అన్నంగి గ్రామాల అంగన్‌వాడీ సెంటర్లు ఉత్తమ అవార్డులకు ఎంపికైనట్లు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లను, పీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు.


మాలలు ఐక్యంగా ఉండాలి

ఒంగోలు వన్‌టౌన్: రాష్ట్రంలో మాలలు ఐక్యంగా ఉండాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అశోక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డు క్యాస్ట్‌లను విభించిన రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటున్నాయన్నారు. రాష్ట్రంలో షెడ్యూల్డు క్యాస్ట్‌లపై దాడులు పెరిగిపోయాయన్నారు. పెరిగిన జనభాను పరిగణలోకి తీసుకుని రిజర్వేషన్‌లు అమలు చేయాలని, ఈ విషయంపై న్యాయస్థానాల్లో పోరాడతామన్నారు.

రాజ్యాంగ హక్కులు అమలు కావడం లేదు


సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

ఒంగోలు వన్‌టౌన్: అహింసా వాదిని కుడా హత్య చేసిన మతోన్మాదం అని విశ్రాంత డెప్యూటీ కలెక్టర్ పేరయ్య అన్నారు. కలెక్టరేట్ ఎదురుగా మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీలు నిబద్ధత కలిగిన ప్రజా సేవకులను, నేటి తరం యువత వీరిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ రైతులకు, బడుగు బలహీన వర్గాలకు రాజ్యాంగ హక్కులు అమలు కావడం లేదన్నారు. రాజ్యాంగంపై పౌరులకు కనీస అవగాహన కల్పించాలల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఓపీడీఆర్ అధ్యక్షుడు చావలి సుధాకరరావు మాట్లాడుతూ నేటి పాలకులు, మతం, కులం, ప్రాంతీయ తత్వాలను రెచ్చగొట్టి అధికారంలోకి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ధర్మచక్ర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జి హరిప్రసాదు, బీసీ సమన్వయ కమిటీ నాయకులు పాల్గొన్నారు.


ఒంగోలులోని నగరోత్సవంలో బాలత్రిపురసుందరీదేవి కళారం


గంటాపాలెం పార్వతీదేవి కళారం నగరోత్సవంలో భక్తులు


గొడుగుపాలెం పార్వేటలో ..



ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 102 రకాల ప్రసాదాల నైవేద్యం

అయిగిరి నందిని.. నందిత మేదిని

- ఒంగోలు ముగిసిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు
- నగరంలో కిక్కిరిసిన ఆలయాలు
- వేడుకగా అమ్మవారి కళారాల నగరోత్సవాలు


చీమకుర్తిలో సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ..


నాగులుప్పలపాడు : పూజలందుకుంటున్న అమ్మవారు



గొడుగుపాలెం పార్వేటలో వివిధ ఆలయాలలోని ఉత్సవమూర్తుల నగరోత్సవం


లాయరు పేటలో బంగారపు రంగు చీరతో రాజరాజేశ్వరీ దేవి


శ్రీగిరిలో ఐదు అడుగుల అగరొత్తిని వెలిగిస్తున్న అర్చకుడు

ఒంగోలు మెట్రో: దసరా శరన్నవరాత్రులు అంగరంగా వైభవంగా ముగిశాయి. విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఒంగోలు నగరంలో గురువారం సాయత్రం శమీ దర్శన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. విజయానికి, సకల శుభాలకు చిహ్నామైన శమీ వృక్షాన్ని విజయదశమి రోజు దర్శించడం శుభప్రదమని భక్తుల విశ్వాసం. శరన్నవరాత్రి ఉత్సవాల్లో చివరిరోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పరమ శాంత స్వరూపంతో చిరునవ్వులు చిందిస్తూ ఒక చేతిలో చెరుకుగడ, మరో చేతిలో అభయముద్రతో భక్తులకు దర్శనమిచ్చింది. నగరంలోని ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఒంగోలు కొండమీద శ్రీగిరి వెంకటేశ్వర స్వామి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం సాయంత్రం శ్రీవారికి తిరువీధి ఉత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. అనంతరం శ్రీనివాస మహిళా కోలాట బృందం తమ కోలాట ప్రదర్శనతో భక్తులను అలరించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, అర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ, కుమారి ఆలూరు జై శంకర్, ఫణి కుమార్, కుమార ఆత్రేయ, వంశీ కృష్ణ తదితరులు కోలాట భజన బృందాన్ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీవారికి ఐదడుగుల ఎత్తైన అగరొత్తిని భక్తులు సమర్పించారు.

– ఒంగోలు ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ రోడ్‌లో పార్వేట మహోత్సవం అద్భుతంగా జరిగిందని క్లబ్ అధ్యక్షుడు తాతా బద్రీనాథ్ తెలిపారు. ఈ మహోత్సవంలో పంచముఖ గాయత్రిమాత అమ్మవారి అలంకరణ మంత్రముగ్ధులను చేసింది. కూచిపూడి భరతనాట్యం అనూష డాన్స్ అకాడమీ వారు అద్దంకి నుంచి వచ్చి అమ్మవారి శివతాండవాల నాట్యాలకుకు నృత్య ప్రదర్శన చేసి పట్టణ ప్రజలను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పతంజలి యోగపీఠ్ రాష్ట్ర అధ్యక్షుడు యోగాచార్య బాలసుబ్రమణ్యం, గుర్రం బదిరి, కోడూరి కిషోర్, కమలాకర్, బియ్యపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలు సిటీ: విజయదశమి పండుగను పురస్కరించుకొని ఒంగోలు లాయర్‌పేటలోని సాయిబాబా ఆలయంలో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, మన్యం ఫణికుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో షిర్డీ సాయి కల్చరల్ మిషన్ కమిటీ సభ్యులు మల్లాది వెంకట సుబ్బలక్ష్మమ్మ, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొత్తపట్నంలో శివపార్వతులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు


నాగులుప్పలపాడు : హోమంలో పాల్గొన్న భక్తులు


చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి శిద్దా కుటుంబ సభ్యులు

వైభవంగా నాంచారమ్మతల్లి గ్రామోత్సవం..

కొత్తపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో దసరా పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రం కొత్తపట్నంలో నాంచారమ్మతల్లి, గంగమ్మతల్లికు, గంగా పార్వతి సమేత నాగేశ్వర స్వామి ఆలయం, మడనూరులో రామలింగేశ్వర స్వామి, పాదర్తిలో భవన్నారణ ఆలయంలో నవరాత్రులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు నాంచారమ్మతల్లి గ్రామోత్సవం నిర్వహించారు. నాంచారమ్మతల్లికు బిందెలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్, పోస్టాఫీస్ సెంటర్, బీచ్ బజారు, శివాలయం వీధి, ఓరుగంటిరెడ్డిపాలెం, జంగంబావి సెంటర్‌లో గ్రామోత్సవం నిర్వహించారు. కొత్తపటన్నం నాగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల గ్రామోత్సం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు

చీమకుర్తి: దసరా నవరాత్రి ఉత్సవాలను చీమకుర్తిలోని పలు ఆలయాలలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక హరిహరక్షేత్రంలో అమ్మవారిని రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా పాండురంగారావు ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి ఆశీర్వాదాలు స్వీకరించారు. చీమకుర్తిలోని సాక్షి రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు రాజరాజేశ్వరిగా అలంకరించగా భక్తులు దర్శనం చేసుకున్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: మండలంలోని గ్రామాల్లో ఉన్న ఆలయాలలో దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్ని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పుగుండూరు గ్రామంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రతి ఏటా అత్యంత వైభవోపేతంగా నిర్వహించే నవరాత్రి వేడుకలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి ఆశీసులు పొందారు. బ్యాంకు బజారులో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తిశ్రద్ధలతో గంగాస్నానానికి తరలించారు. భక్తులచే ఏర్పాటు చేసిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కళారం నగరోత్సవంలో నృత్యం చేస్తున్న యువతులు


నాగులుప్పలపాడు : కోలాటం ప్రదర్శిస్తున్న భక్తులు


గొడుగుపాలెం జమ్మి చెట్టుకు పూజలు చేసి ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

గాంధీజీ ఆశయాలు కొనసాగించాలి

చీమకుర్తి: సంతనూతలపాడు నియోజకవర్గంలో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చీమకుర్తిలో పలు సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. డాక్టర్ జవహర్ ఆస్పత్రి నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వచ్చిన లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘ నాయకులు బస్టాండ్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇద్దరు పేదలకు కుట్టు మిషన్‌లు, చిరుద్యోగులుగా ఉత్తమ సేవలందిస్తున్న నర్సు, అంగన్‌వాడీ ఆయా, ఆశా కార్యకర్త, పోస్ట్‌మ్యాన్, కానిస్టేబుల్, స్వీపర్‌ను ఎంపిక చేసి సత్కరించి నూతన వస్త్రాలు అందించారు. ఎస్సీ బాలికల హస్టల్ విద్యార్థినుల సౌకర్యార్థం రూ.40 వేలతో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్, బూదవాడ మండల పరిషత్ పాఠశాలకు వంటపాత్రలు, పేద విద్యార్థికి కాలేజీ ఫీజుకు రూ.12 వేలు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వంతెన మరమ్మతులకు రూ.20 వేలు, ఎస్‌సీసీ కోచింగ్ స్టూడెంట్లకు 30 రోజుల పాటు అల్పాహారంతో పాటు ఇతర పాఠశాలల్లో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీ జవహర్, అధ్యక్షుడు చలువాది పార్థసారధి, చలువాది బదరీనారాయణ, మారం వెంకారెడ్డి, కొండవీటి ఏడుకొండలు, స్థానికులు పాల్గొన్నారు.


చీమకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఎంపీపీ


చీమకుర్తిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న రవీంద్రారెడ్డి, పార్టీ నాయకులు


నాగులుప్పలపాడులో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు

చీమకుర్తి ఎంపీడీవో కార్యాలయంలో...

చీమకుర్తి రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, పాల్గొని గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ రాఘవేంద్ర, పరిపాలనాధికారి శ్రీనివాసరావు, రాఘువ, సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు మండలంలో...

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని గాంధీజీ విగ్రహానికి ఎంపీడీవో తేళ్ల రవికుమార్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశుధ్య కార్మికులను సత్కరించారు. బీజేపీ మండల అధ్యక్షురాలు పొద అపర్ణ, తదితరులు పాల్గొన్నారు. ఉప్పుగుండూరు వాసవీ క్లబ్, వాసవీ జాగృతి ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. వినోదరాయునిపాలెంలో సర్పంచ్ ఘట్టమనేని అశోక్, విజయభారతి విద్యాసంస్థల అధినేత ఉన్నం చంద్రరావు గాంధీజీ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పొద వరప్రసాద్, ఏపీఎం రవి, రమేష్, కొంజేటి సురేష్, ఆత్మకూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం స్ఫూర్తిదాయకం..

కొత్తపట్నం: జాతిపిత మహాత్మ గాంధీ ఆశయాలు కొనసాగించాలని.. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అందరు మెలగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం జోనల్ ప్రెసిడెంట్, ఎంపీటీసీ సభ్యుడు ఆళ్ల రవీంద్ర రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న మహాత్మ గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగాయపాలెం సర్పంచ్ గాలి స్వరూప, మండల బీసీ సెల్ అధ్యక్షుడు తుళ్లూరి వెంకటనారాయణ, నాయకులు గాలి మునలారెడ్డి, తుమ్మా పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకేయూలో ఘనంగా గాంధీ జయంతి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సిలర్ డీవీఆర్ మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు ఆదేశాల మేరకు మహాత్మాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ నిర్మలమణి తెలిపారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టరు విజయ్‌కుమార్, డాక్టరు సురేష్‌కుమార్, డాక్టరు ఉబ్బా ఈతముక్కలు, సిబ్బంది పాల్గొన్నారు.

7నుంచి క్విస్‌లో అంతరిక్ష వారోత్సవాలు


అంతరిక్ష వారోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యా సంస్థల వైస్ చైర్మన్ గాయత్రి

ఒంగోలు సిటీ: క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించనున్నట్లు క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలిపారు. శుక్రవారం కళాశాలలో అంతరిక్ష వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సతీశ్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ షార్, ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ ఇస్రో, క్విస్ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కళాశాలలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 7వ తేదీన స్పేస్ వాక్‌తో వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. 8న 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు అంతరిక్షం అంశంపై డ్రాయింగ్ పోటీలు, 9న 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించనున్నారు. దాంతో పాటుగా 8, 9 తేదీల్లో కళాశాల విద్యార్థులకు టెక్నికల్ ఎక్స్ పో నిర్వహించనున్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఈ స్పేస్ వీక్ వేడుకల్లో పాల్గొనాలని, అంతరిక్షం, శాటిలైట్లు వాటి పనితీరు తదితర అంశాల గురించి తెలుసుకోవాలని కోరారు. పోస్టర్ లాంచ్ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్, క్విస్ కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ డాక్టర్ బీవీ సుబ్బారావు, వరల్డ్ స్పేస్ వీక్- 2025 ఒంగోల్ సబ్ కమిటీ చైర్మన్ లీలా నాగ శ్రీనివాసరావు, మెంబర్ సెక్రటరీ ఆదిత్య, ఇస్రో అధికారులు రామాంజనేయులు, అప్పారావు, శివ నాగిరెడ్డి, క్విస్ కళాశాల సీఎస్ సీడీఈ డీన్ డాక్టర్ భార్గవ్, డీన్ లు, డైరెక్టర్లు, హెచ్ వోడీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): మండలంలోని మద్దులూరు గ్రామంలోని ప్రతి రైతు రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని మండల తహసీల్దార్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం మద్దులూరు గ్రామంలో రీ సర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి రైతు వారి భూమికి సంబంధించిన హక్కు పత్రం సిద్ధం చేసుకోవాలని, రైతులందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రాజేష్, వీఆర్వో హనుమంతురావు, అశోక్, రైతులు పాల్గొన్నారు.

8 నుంచి ఆధార్ క్యాంపులు

ఒంగోలు వన్‌టౌన్: జాతీయ తపాలా వారోత్సవాలలో భాగంగా ఈ నెల 8 నుంచి 14వ తేదీ వరకూ ప్రకాశం డివిజన్‌లో ఆధార్ నమోదు, అప్‌డేట్ క్యాంపులు నిర్వహించనున్నట్లు సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ మహ్మద్ జాఫర్ సాధిక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకూ డివిజన్‌లో జాతీయ తపాలా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రకాశం డివిజన్‌లోని టంగుటూరు, మద్దిపాడు, పర్చూరు తపాలా కార్యాలయాలలో నిర్దేశించిన పాఠశాలలు, నివాస కాలనీలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారం రోజుల పాటు ఈ కార్యక్రమం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీ వరకూ 7 నుంచి 15 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు బయోమెట్రిక్ అప్డేట్‌కు చార్జీలు ఉండవని వెల్లడించారు.

అపుస్మా జోనల్ కార్యాలయం ప్రారంభం

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జోనల్ కార్యాలయాన్ని జోనల్ ప్రెసిడెంట్ ఏవీ .సుబ్బారావు విజయదశమి పండుగ పర్వదినం గురువారం ఒంగోలు రామ్‌నగర్ మొదటి లైన్‌లో ప్రారంభించినట్లు అపుస్మా ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు తెలిపారు. ఈ జోనల్ కార్యాలయంలో పాత కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సంబంధించిన అపుస్మా సమావేశాలు నిర్వహించడం కోసం, ప్రకాశం జిల్లా సమావేశాలు కోసం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బీ హనుమంతరావు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎ.శ్రీనివాసరావు, ఒంగోలు యూనిట్ ప్రెసిడెంట్ మురళీకృష్ణ, గౌరవాధ్యక్షులు మల్లికార్జున్, కార్యదర్శి వంశీ, కోశాధికారి ధనేష్, శ్రీనివాసచౌదరి, రాధాకృష్ణ, శ్రీనివాసరెడ్డి, మధు, చైతన్య ప్రవంతి, శ్రీను, గీతాంజలి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తగ్గిన జీఎస్టీలతో కుటుంబాలకు మేలు

ఒంగోలు సిటీ: కేంద్రం ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబులతో కుటుంబాలకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజాబాబు పేర్కొన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ, దాని అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఒంగోలు డీఆర్‌ఆర్ఎం హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలుకుతూ రెండు స్లాబులకే పరిమితం చేయడం వలన అన్నీ వర్గాల ప్రజలు వినియోగించే వస్తువల రెట్లు గణనీయంగా తగ్గాయన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో గత నెల 22 నుండి నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికి నెలకు రూ.5 వేల నుంచి 12 వేల వరకు అదా అవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడి వెంకటేశ్వర రావు, మత్స్య శాఖ జేడి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపి చంద్, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం నేడు

ఒంగోలు టౌన్: తెలంగాణ తరహాలో కులగణన చేపట్టాలని కోరుతూ శనివారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తెలిపారు. బీసీ జపం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టడానికి ముందుకు రావడం లేదని విమర్శించారు. వెనకబడిన కులాల హక్కుల సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణా ప్రభుత్వం జనాభా లెక్కల సందర్భంగా కులగణన చేపట్టడం వల్ల ఏఏ కులాల్లో ఎంత మంది ఉన్నారనే విషయం తేలిందని, దాని ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు కేటాయించేందుకు ఆ రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పాస్ చేశారని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా జనగణన నిర్వహిస్తే కులాల లెక్కలు తేలుతాయని అభిప్రాయపడ్డారు. రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు.

స్వచ్ఛ ఆస్పత్రిగా చీమకుర్తి సీహెచ్‌సీ...

చీమకుర్తి: చీమకుర్తి సీహెచ్‌సీ స్వచ్ఛ ఆస్పత్రిగా ఎంపికైనట్లు ఆస్పత్రి ఇన్‌చార్జి డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆస్పత్రిలో క్లీనింగ్, గ్రీనరీ, ఇతర అంశాలను చక్కగా నిర్వహించినందుకు స్వచ్ఛ ఆస్పత్రిగా ఎంపిక చేసినట్లు చెప్పారు.

అనుమతులు లేకుండా దీపావళి మందులు విక్రయించరాదు

సంతనూతలపాడు (చీమకుర్తి రూరల్): అనుమతులు లేకుండా దీపావళి మందులు విక్రయించరాదని సంతనూతలపాడు ఎస్సై అజయ్‌బాబు స్పష్టం చేశారు. శుక్రవారం సంతనూతలపాడులోని పలు టపాసుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతులు లేకుండా దీపావళి మందులు విక్రయిస్తే కఠిన చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు. అన్ని అనుమతులున్న దుకాణదారులు బాణసంచా షాపుల వద్ద అగ్నిమాపక పరికరాలు, నీటి తొట్లు, ఇసుక బకెట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.